# ఓ డి పో య మా నం

కుమారస్వామి, కృష్ణశర్మ, సారధి, వెంకట్రావు—ఆ నల్గురూ ఒకే కాలేజీలో చదువుకున్నారు సబ్జక్ట్సు వేరయినా ముఖ పరిచయం కొందరికి, రూము స్నేహం కొందరికి వుండేది. ఆ తర్వాత ఎవరిపాటికి వారు ఉద్యోగాలలో ఇరుక్కుని అక్కడా యిక్కడా తిరిగినా, కధాకాలం నాటికి రాజధానీ నగరం ఒకరి తర్వాత ఒకరు చేరుకున్నారు. రోడ్లమీదో, ఆఫీసుల్లోనో, హోటళ్ళలోనో ఒకరికొకరు తటస్థపడ్డారు. హల్లో! హాయ్అంటూ పలకరించుకున్నారు. పాత పరిచయం పునరుద్ధరించుకున్నారు. స్నేహం కలిసింది.

స్నేహం వృద్ధయ్యాక నలుగురూ కలసి ఒక యింట్లోనే మకాం పెట్టి చిన్న మెస్ రన్ చేసుకుంటే హోటలు మెతుకులు తినే ఖర్మ తప్పుతుందన్న ఆలోచన వచ్చింది. వెంటనే నల్గురూ అమితోత్సాహంతో ముందుకు వచ్చారు. ఇల్లూ, వంటవాడి కోసం అన్వేషణ మొదలైంది.

వెతగ్గా వెతగ్గా హిమాయత్‌నగర్‌లో ఆ యిల్లు కుదిరింది. నల్గురికి నాలుగు వేరే వేరే గదులు, ఉమ్మడిగా డైనింగురూము, వంటగది వగైరా వగైరా అన్నీ చక్కగా అమిరాయి.

అన్నిటికంటె బాగా అమిరింది పరిసరాలు! యింటికెదురుగా ఓ అందమైన బంగళా! పెద్ద కాంపౌండు, చెట్లు, తోట!

అందమైన ఆ బంగళాకంటె కూడా ఆ సాయంత్రం తోటలో దర్శనం ఇచ్చిన ఆ యింటి యజమానురాలు మరింత ఆకర్షనీయం అనిపించింది. ఆమెను చూడ్డానికి రెండుకళ్ళు చాలవనిపించింది మిత్ర బృందానికి. తమ లాంటి బ్రహ్మచారుల్ని దృష్టిలో పెట్టుకుని దేముడే ఆ చక్కని యింటిని చూపించాడని సంతోషపడ్డారు. కాలక్షేపానికి లోటుండదని ఆనందపడ్డారు. పరమానంద భరితులయ్యారు.

వారంరోజుల లోపలే వంటవాడు మణి యెదురింటి గురించి చాలా సమాచారం సేకరించి మిత్రబృందానికి అందించాడు.

ఆ యింటి యజమానురాలు పేరు రమాదేవి! ఒక్కతే వుంటూంది. నౌకర్లు చాకర్లు యింటినిండా వున్నారు. వంట మనిషి, బంట్రోతు, ఆయా, కారుడ్రైవరు వగైరా. ఆమెకు పెళ్ళయింది. కాని భర్త ఇక్కడ లేడు. ఎక్కడున్నాడో నౌకర్లకి సరిగా తెలియని విషయం! ఆ యింట్లో ఆమెదే రాజ్యం! రోజుకోచీర కడ్తుంది. నెలకోసారి ఫర్నిచర్ అటుదిటు ఇటుదటు మార్చడమేకాక క్రొత్తవికూడా చేరుస్తూంటుంది! ఉన్నట్టుండి ఏ సినిమాకో, క్లబ్బుకో వెడుతుంది. వెళ్ళకపోతే రోజుల తరబడి యిల్లు కదలదు, ఎవరెవరో కార్లలో వస్తుంటారు. పార్టీలు పెద్ద ఎత్తున జరుగుతాయి, అర్ధరాత్రి దాటినా సీసాలు, గ్లాసులు చప్పుళ్ళు నవ్వులు, కేరింతలు వినిపిస్తాయి! సంగీతమూ వుంటుంది. క్లబ్బుల కెడుతుంది. పేకాడుతుంది!

ఏం చేసినా అడిగేవారు అడ్డేవారు లేరు. యీ విషయాలన్నీ స్నేహితులు నలుగురకీ వాళ్ళకే తెలియని ఉత్సాహాన్ని ఉత్సుకతని కలిగించాయనాలి! అలా ఏ కిటికీ దగ్గరో నించుని ఆ యింటివైపు చూపులు సారించేవారు, నలుగురూ కలిసి మాట్లాడుకొనే టప్పుడు తప్పనిసరిగా ఆమె సంభాషణలోకి వచ్చేది.

ఆమె వంటరితనం వాళ్ళకి మరింత ప్రోత్సాహకరంగా వుండేది.

మూడు నెలలు యిట్టే గడిచిపోయాయి. యీ మూడు నెలలు ఆమెను దూరంనుంచి చూడ్డం మాత్రమే జరిగింది. ఆమె పార్టీలకి వచ్చిపోయే పెద్దమనుషులు, వాళ్ళ కార్లు, నౌకర్లు, డ్రైవర్లు వగైరాలని చూడ్డం, ఆమె వెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడు గేటుతెరచి నౌకరు వినయ విధేయతలు! ఆమె కారులో వెళ్ళేతీరు మొదలయినవి పరిశీలించడం జరిగింది. ఆమె ఏ బాల్కానీలోనో కనపడితే కరువుదీరా వీక్షించేవారు. ఏ సాయంత్రమో తోటలో ఆమె తిరిగిందంటే కన్నులపండుగే వాళ్ళకి!

ఓ మూడునెలలు ఆమె సందర్శన భాగ్యంతోనే తృప్తిపడ్డారు. అంతకంటె యేదో జరుగుతుందని, జరగాలని వాళ్లాశించనూలేదు!

కాని ఉన్నట్టుండి కథ మలుపు తిరిగింది. ఒకానొక వాన ముసురు రోజు ఉదయం!

అప్పటికి రెండు రోజులనుంచి ఎడతెరిపి లేని వాన, గాలి! కరెంటు లేదు. బయట జీవితం స్థంభించినట్టుంది.

మిత్రులు నలుగురూ సావకాశంగా ఏడింటికిలేచి వేడి వేడి కాఫీలు త్రాగారు. వెచ్చగా సిగరెట్లు కాలుస్తూ ముందు గదిలో కూర్చున్నారు. వాతావరణం అనుకూలంగా వుందని పేక దస్తా తెరిచారు. రమ్మి మొదలు పెట్టారు.

హఠాత్తుగా గుమ్మం దగ్గర ఓ మెరుపు మెరిసినట్టు రమాదేవి ప్రత్యక్షమైంది. తెల్లటి చీర, తెల్లటి జాకట్టు, చెదిరిన జుత్తు, చేతిలో గొడుగు ముడుస్తూ నలుగురివంక చూసి చిన్నగా నవ్వింది.

మిత్రులు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు. నలుగుర్లో ఒక్కరూ ఆమె నాహ్వానించడంగాని, ఎందుకొచ్చిందో అడగాలనిగాని తట్టనంతగా దిమ్మెరపోయారు.

"లోపలికి రావచ్చునా!" ఆమె అడిగింది.

"అఫ్‌కోర్సు" అన్నారు నలుగురూ ఒక్కసారిగా. అన్న వెంటనే గబ గబ కుర్చీలు ఖాళీ చేశారు. ఆమెను లోపలికి రమ్మని కుర్చీలు చూపెట్టారు. పనున్నట్టు ఒక్కొక్కరూ హడావిడిగా లోపలికివెళ్ళి లుంగీల వాళ్ళు పైజామాల్లోకి, బనీన్లవాళ్ళు షర్టులలోకి మారారు. రేగినజుట్టుని నున్నగా దువ్వుకున్నారు.

రమాదేవి ఆ మార్పులు గుర్తించి నవ్వుకుంది.

"మిమ్మల్ని డిస్టర్బ్ చేసినట్టున్నాను"

"నో నో....డిస్టర్బెన్స్ ఏముంది? మీరు మా యింటికి రావడం చాలా ఆనందంగా వుంది" అన్నాడు సారథి ఎలాగో నోరు పెగిలించుకుని మిగతావాళ్ళు యింకా మాటలకోసం వెతుక్కుంటున్నారు.

"మీరు కూర్చోండి!" అంది రమాదేవి.

అప్పటిగ్గాని యింకా నిలబడే వున్నామని గుర్తురాలేదు నల్గురికి వెంటనే కుర్చీల్లో కూలబడ్డారు.

"యీ వాన చూడండి రెండురోజులబట్టి పట్టుకుని ఎలా వదలడం లేదో, డర్టి న్యూసెన్స్....

"యివాళ కరెంటుగూడా లేదు, చెడ్డ చిరాగ్గా వుంది...."

"అందుకే వచ్చాను, కష్టాలన్నీ ఒకసారే వస్తాయంటారు. వంటావిడకి జ్వరం. మూడు రోజుల్నించి ముసుగుతన్ని పడుకుంది. డ్రైవరు కాస్తా శలవు పెట్టాడు. నౌకరు, పని మనిషికూడా యిప్పటివరకు రాలేదు. కాఫీ చేసుకుందామన్నా అగ్గిపెట్టెలోవున్న పుల్లలు కాస్తా నానిపోయాయి. హీటర్ మీద చేసుకుందామంటె కరెంట్ లేదు. కాఫీ పడందే బండి నడవదు. సరే, ఎదురుగ్గా మీరున్నారుగదా అని వచ్చాను, కాస్త అగ్గిపెట్టె వుంటె యివ్వండి."

వెంటనే నాలుగు చేతులు నాలుగు అగ్గిపెట్టెల్తొ ముందుకి వెళ్లాయి. రమాదేవి ఒక్కక్షణం ఏం చెయ్యాలో తోచనట్టు ఆగి, తరువాత నవ్వేసింది. రెండుచేతుల్తో రెండు రెళ్లు నాలుగు అగ్గిపెట్టెలూ తీసుకుని "థాంక్స్ ఒక నెలపాటు అగ్గిపెట్టెల ఖర్చు లేదన్నమాట!" అంది.

మిత్రులు నలుగురూ తెల్లబోతూ నవ్వేశారు.

"వెళ్తాను," అంటూ లేచింది రమాదేవి.

"ఉండండి, ఉండండి, కాఫీ త్రాగి వెడుదురుగాని...." నలుగురూ యించుమించు ఒక్కసారే అన్నారు. ఒకడు మణికోసం కేకపెట్టాడు. మరోడు వంటింటివైపు నడిచాడు. ఇంకోడు మణితో 'నారాయణాస్ కాఫీ పౌడంతో కాకుండా, ఎమర్జెన్సీ స్టాక్ నెస్‌కాఫీ కలుపు సుమా' అని చెప్పి వచ్చాడు.

"థాంక్యూ, రక్షించారు. ఇప్పుడింటికెళ్ళి కాఫీకోసం గిన్నెలతో కుస్తీపడే అవస్థనించి తప్పించారు...." అంటూ నవ్వింది రమాదేవి.

ఆమె ధోరణిలో ఎన్నో యేళ్ళ పరిచయం కనపడింది ముఖ్యంగా అలాంటి చొరవ యెంత చదువుకున్న ఆడవాళ్ళలోనైనా చూడం. ఠీవి హుందా వుంది ఆమె మాటల్లో, చూపుల్లో ప్రవర్తనలో ఏదో ఉన్నత కుటుంబానికి చెందినదయి వుండాలి అనిపించింది నలుగురికి. యివతలివాళ్ళ సపర్యలు అందుకోడం తన హక్కు అన్నట్టుంది ఆమె ధోరణి.

అందరిని వివరాలడిగింది రమాదేవి, పుట్టుపూర్వోత్తరాలు వాకబు చేసింది. కుమారస్వామి అందరి గురించి చెప్పాడు.

"బాగుంది, నలుగురూ ఇంజనీర్లన్నమాట! చక్కగా కలిశారు, మిమ్మల్నిచూస్తే ముచ్చటగా వుంది!" అంటూ ఓ కాంప్లిమెంట్ పారేశింది.

ఆవిడ గురించి వివరాలడగడానికి నలుగురికీ రకరకాల అనుమానాలు అడ్డొచ్చాయి. సంభాషణలు పొడిగించడమెలాగా అని అవస్థపడేంతలో ఆ పరిస్థితిని తప్పిస్తూ మణి కాఫీ కప్పులతో వచ్చాడు. నలుగురూ నాలుగు కప్పులు ముందుకు చాచారు. "అగ్గిపెట్టెలంటే తీసుకున్నాను. కాని, నాలుగు కప్పులు ఒక్కసారి ఎలా తీసుకోను చెప్పండి" నవ్వుతూ అంది రమాదేవి. నలుగురూ సిగ్గుపడి చేతులు వెనక్కి లాక్కున్నారు. ట్రేలో పెట్టిన కప్పు తనే తీసుకుంది రమాదేవి. మీ చేతుల్లోవి మీరే త్రాగేయండి! అంది చనువుగా.

"కాఫీ చాలా బాగుంది. వెరీనైస్.... 'అంది రమాదేవి మెల్లగా సిప్‌చేసి నవ్వు పులుముకున్నారు. మొఖాలకి నలుగురూ.

ఇంకో కప్పు తీసుకోండి. పోనీ ఫ్లాస్కులోపోసి పంపమంటారా తర్వాత తీసుకోడానికి.... కుమారస్వామి అడిగాడు, ఆమె కప్పు టేబిల్ మీద పెట్టాక.

"అబ్బే ఎందుకు, కాస్సేపట్లో మా రెడ్డి వస్తాడు. వాడిచేత తెప్పించుకుంటాను హోటల్నించి అంతగా అవసరమైతే...."

"హోటల్నించి ఎందుకు. ఆకాఫీ మీలాంటివారు త్రాగగలరా. ఫ్లాస్కులో పోసి తెస్తాడు మణి.... అన్నాడు కృష్ణశర్మ.

"మరి వంట మనిషికి జ్వరమయితే, భోజనానికి ఏం చేస్తున్నారు! ఆరా తీశాడు వెంకట్రావు.

"ఏదో రాత్రిపూట పార్టీల పేరుతో అక్కడా ఇక్కడ సరిపోయింది. మధ్యాహ్నం రెడ్డి చేస్తున్నాడు. అంతకంటే హోటలు వంటే బాగుందనిపించింది నాకు, వాడొచ్చాక క్యారియర్ తెస్తాడు....'....నిజంగా వంట రాకపోవటం ఎంత ఇబ్బంది. ఇప్పుడయినా నేర్చుకోవాలి. ఇంక ....కాని ఏదో గొడవతో కుదరదు! అసలు మా ఫ్రెండ్స్ ఎవరికీ వంట

మనిషికి జ్వరమని తెలియదు. లేకపోతే హోటల్లో తింటావా అని యుద్ధానికి వచ్చి వుండేవారు !...."

"అవును, మీ రెందుకు అవస్థపడడం ఎదురుగా వున్నాం, మా వంటవాడు వండుతాడు మీ కోసంకూడా, మీ వంట మనిషికి నయమయేదాకా...."

"యెందుకు మీకా శ్రమ. దాని కెప్పటికి నయమవుతుందో...."

"యిందులో శ్రమకేముంది. మేం వండం గదా, మా మణి వండి క్యారియర్‌లో తెచ్చిస్తాడు మీకు....ఏదో రెండు మూడు రోజులు సర్దుకుందురు గాని...." అందరూ తలో మాట అని రమాదేవిని మొహమాట పెట్టారు.

"వద్దండి నేనేదో ఊరకే అన్నాను, ఆ మాత్రం రెండు రోజులు గడుపుకోగలను. యిటీజ్ ఆల్‌రైట్, మీరు లేకపోతే ఏం చేసేదాన్ని...." భోజనం ఏర్పాటు కోసమే వచ్చినట్టు అనుకుంటారేమే నన్న సంభ్రమంలో తడబడ్తూ అంది రమాదేవి.

కాని మిత్రులు వదలలేదు. బలవంతపెట్టి రమాదేవిని, అంగీకరింపచేశారు. తరువాత రెండు రోజులు క్యారియర్ సరఫరా జరిగింది.

కాఫీ త్రాగి, రెండు రోజులు ఆ యింట భోజనం తిన్న రమాదేవి వాళ్ళకి ఋణపడినట్టు మరో పది రోజులకీ నల్గురిని డిన్నర్‌కి పిలిచింది. మరోసారి ఏదో అవకాశం పురస్కరించుకుని టీకి పిలిచింది. ఆ తర్వాత ఆమె యింట్లో జరిగే పార్టీలన్నింటికి, వాళ్ళు ఆహూతులయ్యారు.

అలా మొదలయిన వాళ్ళ పరిచయం క్రమేపీ వృద్ధిచెందింది. ఏమీ తోచని సాయంకాలాలు తోటలో కుర్చీలు వేయించి టీ త్రాగుదాం రమ్మంటుంది. అప్పుడప్పుడు ఏ సినిమాకో బయిలుదేరి ఆవేళకి ఎవరెదురుగా వుంటే వాళ్ళని తీసుకెడుతుంది. పేరుపెట్టి "నీవు" అంటు చనువుగా మాట్లాడే రమాదేవికి తామంటే ఎంతో ఇష్టమని అనుకుంటారు తప్ప ఆ నల్గురూ కించపడరు. ఆమె చనువు వాళ్ళకి ఆనందం!

రమాదేవితో పరిచయం మొదలయ్యాక వాళ్ళ ప్రవర్తనలో, ఆలోచనల్లో, మాటల్లో, ఆఖరికి తమలో తాము పరస్పరం చూపుకునే స్నేహపూరిత వాతావరణంలో అనుకోని మార్పులు రాసాగాయి.

రమాదేవి అందమైనది. అందమైనదేకాక అందమైన భావాలు గలది! ఆధునికత అంటే ఇష్టం! మగాడ్ని చూసి ముడుచుకుపోయి మూల కూర్చునే రకంగాదు. చనువు ఇస్తుంది! చనువు తీసుకుంటుంది. స్వేచ్ఛ గోరుతుంది. తెలివి గలది. తెలివిగా మాట్లాడగలది! అన్నింటిని మించి ఎదుట వ్యక్తిని వశపరచుకోగల సమ్మోహనాస్త్రం లాంటి చిరునవ్వు గలది! ఒక్క చూపుతో మనిషిని చుట్టూ త్రిప్పుకోగలదు. వొకసారి చూసి, ఆమెతో మాట్లాడిన వ్యక్తి మళ్ళీ మళ్ళీ ఆ అనుభవాలకోసం ఆరాట పడతాడు. ఆమె స్నేహంకోసం తపించకుండా వుండలేడు. ఆమె చూపే చనువు, చొరవ చలాకీ, అప్పుడప్పుడు మగవాళ్ళకి వేరే అర్థాలు చెపు తాయి. ఆ జంటనగరాలలో ఆమెకి తెలియని బార్లు, హోటళ్ళు, క్లబ్బులు లేవు. పెద్ద పెద్ద క్లబ్బుల్లో మెంబరు! ఎక్కడికెళ్ళినా ఆమెని పెద్ద పెద్ద వాళ్ళంతా అట్టహాసంగా ఆహ్వానిస్తారు. నమస్కారాలు పెడతారు. మన్ని స్తారు, గౌరవిస్తారు, ఆరాధిస్తారు. ఆమెకంటె ధనవంతులు, హోదా, పలుకుబడి కలవారుండచ్చు. కానీ ఆమె చుట్టూ వున్న ఆకర్షణ వేరు. దాన్ని గ్లామర్ అనవచ్చునేమో! అది ఆమెకున్నంతగా మరొకరికి లేద నాలి!

ఆ గ్లామరుని ఉపయోగించుకోడమూ ఆమెకి బాగా తెలుసు. వ్యక్తుల్ని సులభంగా ఆకర్షించి చుట్టూ త్రిప్పుకుని, అవసరం తీరగానే అంత సులభంగానూ వాళ్ళ ఖర్మానికి వాళ్ళని వదిలేసి మర్చిపోగలదని కొందరంటారు.

పరిచయం ఎక్కువయినకొద్దీ నలుగురూ రకరకాలుగా ఆమె స్వభావం గురించి చర్చించుకునేవారు –వాదులాడుకునేవారు.

మొత్తం మీద నల్గురికి రమాదేవి మంచి కాలక్షేపంక్రింద తయా రయింది.

ఓ రాత్రి ఏడెనిమిది గంటలవేళ ప్లేట్లతో ప్రసాదం లాంటిదేదో తెచ్చాడు మణి.

“ఏమిట్రా ఇది వెంకట్రావు అడిగాడు. నలుగురూ ప్లేట్లు అందు కుంటూ ఆశ్చర్యంగా చూశారు.

"ఎదురింటి అమ్మగారు పంపారండి. వారు సత్యన్నారాయణ వ్రతం చేసుకున్నారట...."మణి మెల్లగా చెప్పాడు.

సత్యన్నారాయణ వ్రతం. నలుగురి ఆశ్చర్యానికి అంతులేక పోయింది. వినీలాకాశంలో తెల్లమబ్బు ముక్కలాగ అతకనట్టని పించింది.

"వెళ్ళిన బ్రాహ్మణులందరికి మామిడిపళ్ళు, రెండేసి రూపాయలు, కూడా ఇచ్చిపంపారండి." అన్నాడు మణి. అది తనకీ ముట్టిన వైనం ప్రకటిస్తూ, ఆమె యెడ గౌరవ ప్రపత్తులు వాడి మాటల్లో చూపుల్లో వ్యక్త మవుతున్నాయి.

"ఎన్న సమాచారం ?" మణి వెళ్లాక కుమారస్వామి కొంటెగా అన్నాడు.

"పాప పరిహారార్థం గాబోలు!" వెంకట్రావు నవ్వాడు. ఒక్క క్షణం మౌనం.

"పాపాలేం చేసింది ?" శర్మ అదోలా చూశాడు.

"ఏం కథ ? ఆవిడ్నంటే నీకు ఉలుగ్గాఉంది!" వెంకట్రావు ఉడి కించాడు.

"సినిమాకి తీసికెళ్ళిందిగా మొన్న," స్వామి.

"నీ కెందు కంత బాధ. యీసారి నిన్ను తీసికెళ్ళమంటానులే !"

"నీ సిఫార్సెవడికి కావాలోయ్. ఇంతకీ ఆ పాపం కథేమిటి ?"

"ఏముంది ? రాత్రిళ్ళు ఒంటిగంట రెండు గంటలదాకా బారుల్లో క్లబ్బుల్లో తాగడం, తందనాలాడ్డం, ఒళ్ళు తెలియకుండా కనబడ్డ వాళ్ళం దరితో డాన్సులు, విహారాలు,....యివన్నీ పాపం కాక పుణ్యాలేమిటి ?"

"కానీ మొన్నేమయిందనుకున్నావు ? యిద్దరం అలా కార్లో పోతున్నాం. ఉన్నట్టుండి దేవాలయం ముందు కారాపింది. అభ్యంతరం లేకపోతే లోపలికి వెడదాం అంది, లోపలికెళ్ళాం. రెండు రూపాయలు పళ్ళెంలో వేసింది భక్తిగా పూజారి ఇచ్చిన హారతి కళ్ళ కద్దుకుంది. బొట్టు పెట్టుకుంది. తలలో పువ్వు పెట్టుకుంది. అలాంటి పని చేయడం

ఆధునికత, నాగరికతలకు భంగం, అనుకునే ఈ రోజుల్లో ఆమె ప్రవర్తన ఆశ్చర్యమనిపించింది. అందులో రమాదేవిలాంటి మనిషి...."

"చిత్రమైన మనిషి !"

"మాడర్న్ఆర్ట్అన్నా అర్థం చేసుకోవచ్చుగాని....యీ రమాదేవి మనస్తత్వం ఏమిటో అర్థం గావడం లేదు."

"దానికేముంది! చేసేవి గంగా స్నానాలు....అనే సామెత ఒక టుందిగా"!

"ఒరేయ్ స్వామీ, మరీ అంత అన్యాయంగా మాట్లాడకు, ఆమె ఎలాంటిదో, ఎందుకలా చేస్తుందో మనకేం తెలుసు !"

"నాన్సెన్స్ ! ఇంతకన్నా యింకేం తెలియాలి ? రోజూ చూడ్డం లేదా ?"

"నిన్నెప్పుడూ ఎక్కడికీ పిలవలేదనేనా యీ అభాండా లావిడ మీద ?" యీసారి వుడికించటం వెంకట్రావు వంతయింది.

"ఏడిశావ్ ! నాక్కావాలంటే ఊళ్లో లక్షమంది ఉన్నారు! ఈ ముసిల్దాని వెనకాలబడాల్సిన ఖర్మం పట్టలేదు !"

"ద్రాక్షపళ్ళు పుల్లగా వుంటాయట, అప్పుడప్పుడు!" నవ్వాడు వెంకట్రావు.

"ముసిల్దా. మహావుంటే ముప్పైమూడో, నాలుగో వుంటాయి. అంతే! ఆ అందం, చందం, నునుపు, చలాకితనం పదహారేళ్ళ పిల్లకికూడా వుండవు."

"అసలు రోమాన్సు అన్నది టీనేజ్ గర్ల్స్‌కేం తెలుస్తుందోయ్! సిగ్గుతో ముడుచుకుపోతారు తప్ప! శృంగారం కావాలంటే ప్రౌఢలే బెస్టు అన్నాడు భర్తృహరో, మరోడో!"

"శృంగార పాఠాలు బాగానే వంటపట్టించినట్టుంది!"

"వేళాకోళం గాదుగాని. నిజంగా ఆమెలో ఏదో బాధ అణిగివుందని పిస్తుంది. ఆ బాధ మరచిపోవడానికి ఆమె అడ్డమైనవాళ్ళతో విచ్చలవిడిగా తిరిగి కాలయాపన చేస్తుంది. కాని అలా తిరగడంలో ఆమెకు నిజమైన ఊరట కలగడంలేదు. ఆమెలో అశాంతి మరింత ఎక్కువవుతుంది.

అన్నిటినీ మరచిపోవాలని కఠోర సత్యాలనించి పారిపోవాలని ఆమె చేసే ప్రయత్నాలు నిజంగా ఆమెకి బాధనించి విముక్తి కలిగించడం అటుంచి ఆమెలో ఘర్షణ లేపుతుంది. దాని పరిణామమే ఆమెచేసే పూజలు పున స్కారాలు...." సారథి ఆమె మన స్తత్వాన్ని తనర్థం చేసుకున్నంత వరకు మిగతా వాళ్ళకి వివరించబోయాడు.

"చప్పట్లు కొట్టండోయ్....కవి కుమారుడు, కథానాయిక శీల పరిశీలన చేస్తున్నాడు!...."చప్పట్లు కొడుతూ అన్నాడు స్వామి వెంకట్రావు–శర్మ నవ్వారు.

"ఆవిడేంచేస్తే మన కెందుకురా! మనం బ్రహ్మచారులం! ఆవిడ మనలాగే వంటరిది! మన మామె స్నేహాన్ని వాంఛించాం. ఆమె తనంతట తానుగా మనకి స్నేహితురాలైంది. హాయిగా కార్లో త్రిప్పుతూంది. శుభ్రంగా డిన్నర్లు, పార్టీలు యిస్తూంది. కాలక్షేపానికి లోటులేదు. ఇంత కన్న యింకేంకావాలి? ఆవిడ గొడవలు మనమెందుకు పట్టించుకోవడం?–" వెంకట్రావు.

"నేనూ అదే అనేది! ఆమె మనకన్నా పెద్దది! మన అంత స్తుకన్న పై అంతస్తుది! ఏదో బాధలో వున్నట్టు కనిపిస్తూంది. మనకు చాతనయితే సహాయం చెయ్యగలిగితే చెయ్యాలి, లేకపోతే వూరుకోవాలి అంతేగాని యీ విమర్శలెందుకు! ?" శర్మ బుద్ధిమంతుడు.

వాళ్ళ నలుగురి మన స్తత్వాలు వేరు, దృక్పథాలు వేరు. శర్మది ధార్మికదృష్టి అయితె, సారథిది కళాకారుడి దృష్టి! కుమారస్వామికి ఎలాగైనా ఆమె కావాలి! వెంకట్రావుకి దొరికితే అభ్యంతరం లేదు కాని దొరక్కపోయినా బాధలేదు.

కాలం గడచినకొద్ది రమాదేవి వాళ్ళల్లో చిన్నచిన్న కలతలకి కూడా కారణమయ్యేది. స్వామి ఏవో మాటలు ఆమెనిగురించి అనేవాడు. అవి సారథికి, శర్మకి కోపం తెప్పించేవి. ముఖ్యంగా శర్మకి.

కాని రమాదేవి అందరిని సమంగానే చూసేది! అందరితో చనువుగా మాట్లాడేది! అభిమానంగా టీలకి, కాఫీలకి, భోజనాలకిఆహ్వానించేది! ఆమె ఎదుట అందరు సభ్య సంస్కారాలు మూర్తీభవించినట్లు నడుచు

కుంటారు. మాట్లాడుతారు. అయితే కొందరిలో అది స్వభావికం అయితే, కొందరిలో అది నటన మాత్రమే!

*　　　*　　　*

ఆ రోజు—

రమాదేవి ఒంటరిగా కారులో వెడుతూంది. టాంక్ బండ్ మీద మెత్తగా మెల్లగా పాములాగ ప్రాకుతూంది కారు.

ఆ రోజు ఏం కాలక్షేపం కాలేదు రమాదేవికి. ఫ్రెండ్సు ఎవరూ రాలేదు. ఎవరింటికి వెళ్ళినా ఎవరూ కనపడలేదు. అలా ఎవరన్నా కనిపిస్తే బాగుండునన్నట్టు నెమ్మదిగా నడుపుతున్న రమాదేవికి టాంక్ బండ్ మీద నెమ్మదిగా నడిచి వస్తున్న కుమారస్వామి కనిపించాడు.

"హలో! ఎటు వెడుతున్నావు?" కారు ప్రక్కకి తీసి అడిగింది.

"ఎటూ లేదు, ఊరికే తోచక, అలా".... కాస్త గాభరాగా అన్నాడు స్వామి.

"అయితే రా....అలా ఎటన్నా వెడదాం."

కుమారస్వామి కారెక్కాడు, మహాభాగ్యం అన్నట్టు!

"ఏమిటో యివాళ ఏం తోచడంలేదు, సమ్మె కట్టినట్టు ఎవరింటికి వెళ్ళినా యెవరూ లేరు. క్లబ్బుకి వెడదామంటే బుద్ధి పుట్టడంలేదు. అలా దూరంగా ఎక్కడికో పారిపోవాలనిపిస్తూంది!" అదోలా వుంది రమాదేవి స్వరం. ఆ నవ్వు పేలవంగా వుంది.

తల త్రిప్పి రమాదేవివైపు చూశాడు స్వామి. కళ్ళు కాస్త యెర్రగా ఉన్నాయి—నిద్ర చాలనట్టో, కాస్త నిషా యెక్కువైనట్టో! కళ్ళు బరువుగా అలసటగా వున్నట్టనిపించింది. రాసుకున్న క్రీములు, పౌడర్లు కళ్ళక్రింద నల్లచారల్ని దాచలేక పోతున్నాయి.

మౌనంగా డ్రైవ్ చేస్తూంది రమాదేవి.

"వంట్లో బాగులేదా మీకు?" స్వామి అడిగాడు, ఆ నిశబ్దాన్ని భరించలేక. ఏదో మాటలు కలపాలని.

"వంట్లో ఏం లేదు, మనసే బాగులేదు!"

"ఏం?" అనడిగే చొరవ చేయలేకపోయాడు కుమారస్వామి. ఆమె ఏమన్న చెప్తుందని ఆశించాడు. కాని ఏం చెప్పలేదు ఆమె.

ఆమె ధోరణి స్వామికి నిరుత్సాహం కల్గించింది. ఆ ధోరణిలో వున్న ఆమెకి కంపెనీ యివ్వడం స్వామికి ఇష్టంలేదు. అతని స్వభావానికి సెంటిమెంట్స్, మూడ్స్ కుదరవు, ఏ క్షణంలో ఏది వీలయితే అది అనుభవించు....ఆనందించు అంతవరకే!

కారు జోరుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్....రేస్‌కోర్సు కూడా దాటిపోసాగింది.

"పోనీ ఏదన్నా సినిమాకి పోదామా, టివోలీలో మంచి పిక్చరుంది." అడిగాడు కుమారస్వామి.

"అన్నీ చూడ్డం అయిపోయింది! సార్"

ఇంకేం అనాలో తోచక వూరుకున్నాడు స్వామి.

కొంతదూరం పోయాక స్లో చేసి "తల తిరుగుతున్నట్టుంది" అంటూ కళ్ళు మూసుకుని నుదురు రాసుకుంది రమాదేవి.

"పోనీ నేను డ్రైవ్ చెయ్యనా?" అడిగాడు స్వామి.

"ఇఫ్ యు డోంట్ మైండ్" ఆమె అంది. సైడికితీసి కారాపింది. స్వామి దిగి అటునించివచ్చి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. రమాదేవి కాస్త జరిగి తల వెనక్కి వాల్చింది.

"ఎటు వెళ్దాం? ఎక్కడికి?" స్వామి అడిగాడు స్టీరింగ్ పట్టుకుని.

"ఎటో అటు! ఎక్కడికైనాసరే! యిల్లు వాకిలి. ఈ మనుష్యులు ప్రపంచం అన్నీ వదిలి పారిపోవాలనుంది ఇవాళ నాకు!" కళ్ళు మూసుకుంటూ అంది రమాదేవి.

రమాదేవికి కుమారస్వామికి మధ్య భేదం చాలా తక్కువుగావుంది. స్పీడు హెచ్చించి మలుపులు త్రిప్పి, బ్రేకువేసి పోతూంటే ఆమె శరీరం అతనికి తగలసాగింది మెత్తగా, మృదువుగా. ఆమెవాడే సబ్బేమిటో, ఆమె రాసుకునే ఖరీదయిన పౌడరేమిటో, పులుముకున్న విదేశీ సుగంధమేమిటో, అన్నీ కలసి రకరకాల పరిమళాలు స్వామికి మత్తెక్కిస్తున్నాయి. అతని మనసు స్వాధీనం తప్పుతున్నట్టనిపించింది. స్టీరింగ్‌మీద చెయ్యి, యాక్సి

లేటర్ మీద కాలు వణుకుతున్నాయి. మధ్య మధ్య కారు గమనం సాగక "సారీ" చెప్పుకుంటున్నాడు. ఓరకంటితో ప్రక్కన వాలిఉన్న ఆమె పసిమి శరీరం చూస్తుంటే పిచ్చెక్కుతూంది. స్లీవ్‌లెస్ తాలూకు ఆ నున్నటి గులాబిరంగు బుజాలని చేతితో తాకాలన్న ఆవేశాన్ని కోరికని అదుపులో పెట్టుకోడం కష్టమవుతూంది.

ఆరోజు లభ్యమయిన అవకాశాన్ని జారవిడవద్దని అతని మనసు గట్టిగా హెచ్చరిస్తూంది. కాని ఏదో బెరుకు! ఏం చెయ్యాలీ. ఎలా మొదలు పెట్టాలీ తేల్చుకోలేని అయోమయంతో అతనికి చెమటలు పడుతున్నాయి! యింతకీ ఆమె మనసులో ఏముందో! అనవసరంగా తొందరపడితే, ఆమె ఉద్దేశం మరోటయితే అసలుకే మోసం రావచ్చు.

కానీ ఏకాంతం! సాన్నిహిత్యం! యింతకన్న యేదికావాలి! ఆమె ఎంత తెగించిందయినా చొరవగా ఎలా చెప్తుంది! ఇంతవారుండగా ఇలా తనమీద వ్రాలినట్టు ఎందుకు కూర్చుంటుంది! యింతకంటె స్పష్టంగా ఏం చెప్పాలి!

యాంత్రికంగా కారు నడుపుతున్న స్వామి మనసు. శరీరం ఆమె కోసమే పరితపిస్తున్నాయి. ఆమె మనసు ఏదన్నా సంకేతంద్వారా తెలుసు కోవాలి! యెలా యెలా! స్వామి ఆలోచనలు కారుకన్నా వేగంగా పరిగెత్తు తున్నాయి.

రమాదేవి చల్లగాలి తగలగానే కళ్ళు తెరిచింది. ఆమె కళ్ళు అల సటగావున్నా యిదివరకటికంటె యిప్పుడు కాంతి పుంజుకున్నాయి. అతని వంక నవ్వుతూ చూసింది.

"యిందాక ఏమిటో, కళ్ళు చీకట్లు కమ్ముతున్నట్టు, తల తిరిగి పోతు న్నట్టు అనిపించింది. యిప్పుడు ఫరవాలేదు. కాస్త చల్లగాలి తగలగానే హాయిగా వుంది. ఐ ఫీల్ బెటర్ నౌ" అంది.

"కాసేపు విశ్రాంతి తీసుకోండి, అలాగే పడుకుని!" నవ్వి అన్నాడు స్వామి.

కొద్దిసేపు నిశ్శబ్దం! రమాదేవి బ్యాగు తెరిచి రుమాలుతో మొహం తుడుచుకుంది. పౌడ రద్దుకుంది ఎగిరిపోతున్న జుట్టుని స్కార్ఫ్‌తో

బంధించింది. ఎందుకో ఈ ముస్తాబని ఊహిస్తున్న కుమారస్వామిని ఏదో తీయని ఊహ. అంటీ అంటని ఆమె శరీరంలాగ పులకింపచేసింది.

ఎంతసేపు ఈ సస్పెన్సు! ఏదో జరగాల్సింది జరగకుండా, వృధా కాలయాపన చేస్తున్నట్లు బాధగా వుందతనకి. రమాదేవి దూరం, దగ్గరా కాని స్థితిలో కూర్చోక ఏదన్నా చొరవ చూపిస్తే ఎంత బాగుణ్ణు! కొద్దిపాటి ఆసరా కలిగిస్తే చాలు, యింక మిగతా బాధ్యత తనది! ఏదో చిరాకు కలగ సాగింది. తనే ఆ చొరవచూపిస్తే ....ఏం చేస్తుంది?....ఏం చెయ్యగలదు?

పరధ్యానంగావున్న కుమారస్వామి ప్రక్కనుంచి అడ్డంగా గేద రావడం గమనించనేలేదు. గమనించిన రమాదేవి చివరి క్షణంలో 'కుమార్!' అని గట్టిగా అరవడం మాత్రం చేయగల్గింది. స్వామి స్టీరింగ్ ప్రక్కకిత్రిప్పి సడన్ బ్రేక్ వేశాడు. కారు రోడ్డుకి అడ్డంగా తిరిగి ఒక్క కుదుపుతో ఆగింది, గాభరాపడిన గేదె వొక్క గెంతుగెంతి కారుమడ్ గార్డునివచ్చి ఢీకొని అంతదూరం ఎగిరి దుమికింది. గేదె మాటేమైనా, రమాదేవి తల డాష్ బోర్డుకి తగిలి వెనక్కిపడ్డంలో అతని వడిలోకి వాలింది.

కుమారస్వామికి ఆ వొక్కక్షణంలో జరిగిందేమిటో అప్పటికీ అర్థం కాలేదు....కానీ, వొడిలో అదుటునపడ్డ రమాదేవి మాత్రమే ఆ క్షణంలో కంటికి, మనసుకి అనింది. నల్లటి చిన్నచిన్న ముంగురులు కప్పిన తెల్లటి మెడ, గులాబిరంగు నడుం అతన్ని కవ్వించాయి. ఆవేశంగా తల వంచి మెడదగ్గిర ముద్దాడాడు. నడుంచుట్టూ చెయ్యివేసి మరింత దగ్గరగా అదుముకున్నాడు అంతా అరనిమిషం.

ఆ స్పర్శకి రమాదేవి చివుక్కునలేచి కూర్చుంది. అతనివంక అదోలా చూసింది. ఆమె పెదాలు అదిరాయి.

"యూ....యూ...." ఏదో అనాలని అనలేకపోయింది, కుమార స్వామి కెక్కడలేని చొరవ, ధైర్యం వచ్చాయి. ఆమె బుజంమీద చెయ్యి వేసి దగ్గిరగా లాక్కున్నాడు అతని మొహంలోకిచూస్తూ ఆమె అచేతనంగా ఉండిపోయింది. కుమారస్వామి ఆమె చెంపల్ని చేత్తో మెల్లిగారాశాడు, బుజ్జగిస్తున్నట్టు.

మరు నిమిషంలో ఆమె అతని చేతుల్నితీసి తన సీట్లో కూర్చుని రెండు చేతుల్తొ మొగం కప్పుకుని ముందుకు వంగింది. ఆమె ఏడుస్తూందని వణికే తల సన్నని స్వరాలు తెలుపుతున్నాయి.

స్వామి చకితుడయ్యాడు: అతని ఉద్రేకం చల్లారి, ఆమెని గాయపరచానన్న ఆవేదన పట్టుకుంది. ఏం చెయ్యాలో, ఆమెని ఏమడగాలో, ఎలా ఓదార్చాలో, ఏమనాలో, ఏమనగూడదో, క్షమార్పణ చెప్పుకోవాలో, అక్కరలేదో—అంతా అయోమయంగా వుందతనికి.

"రమాదేవిగారూ!" మెల్లిగా పిల్చాడు.

ఆమె మాట్లాడలేదు.

"క్షమించండి....నావల్ల పొరపాటు జరిగింది....ఎక్స్యూజ్ మీ...." వణికే గొంతుతో మెల్లిగా అన్నాడు.

ఆమె మాట్లాడకుండా లేచి తిన్నగా కూర్చుంది. రుమాల్తో కళ్ళు తుడుచుకుంది. అతనివంక వొక్క క్షణం చూసింది, అంతలోనే ఏం జరగనట్టు చిన్నగా నవ్వింది.

"అబ్బ! ఏం గాబరాపెట్టావు! యింకాస్త వుంటే యివాళ పెద్ద ఏక్సిడెంట్ అయివుండేది. అంత పరధ్యానం అయితే ఎలా......చూడు కారుకేమన్నా అయిందేమో" ఇంతసేపూ ఆ ఏడుపు, దుఃఖం అంతా ఏక్సిడెంట్ గురించే అన్నంత మామూలుగా మాట్లాడింది. స్వామి తెల్లపోయాడు. ఆవిడ ఆజ్ఞ శిరసావహించి దిగివెళ్ళి చూశాడు. గేదె తాకిడికి మడ్‌గార్డ్ కాస్త వంకరఅయి లొత్తపడింది. అదే చెప్పాడు అదోరకంగా భయపడ్తూ. ఖరీదయిన కారు! తన ధర్మమా అని పాడయింది.

"ఊఁ....కానీ, ఏం చేస్తాం....యివాళ రోజు మంచిదికాదు! ఉదయంనించీ అన్నీ అస్తావిస్తంగానే జరుగుతున్నాయి"

కారు వెనక్కితిరిగి బయలుదేరింది యీసారి రమాదేవే స్టీరింగ్ ముందు కూర్చుంది. బాగా చీకటి పడింది. చాలా సీరియస్‌గా ఏభై మైళ్ళ స్పీడ్‌తో నడుపుతున్న రమాదేవిని పలకరించే సాహసం చెయ్యలేకపోయాడు కుమారస్వామి. చీకటిలో ఆమె మొహంలో హావభావాలు అర్ధమవడంలేదు.

అతనిలో రకరకాల ఆలోచనలు ముసురుతున్నాయి. ఆమె తన ప్రవర్తనకి బాధపడిందా! బాధపడితే తర్వాత మామూలుగా నవ్వుతూ ఎందుకు మాట్లాడుతుంది! అసలు అంత ఇష్టంలేనిదయితే తనకంత దగ్గరగా మీదపడినట్టు ఎందుకు కూర్చుంటుంది! ఆ యేడుపు ఎందుకు? తను ఆఖరి క్షణంలో వెనకాడ్డంవల్ల. ఆమె ఆలోచన కొనసాగక, పతివ్రతన్నట్టు తనకి భావం కలగచెయ్యాలని—ప్రయత్నమా? ఆ కన్నీరు నటనా! లేక ఆ నవ్వు నటనా! ఎన్నోరకాల అనుమానాలు, ఆలోచనలు అతని మనసుని కలతబెట్టాయి.

ఊళ్లోకి రాగానే నీలాన్ లైట్ల వెలుగులో దొంగతనంగా రమాదేవి మొగం పరిశీలించాడు. ఆమె ఎటూ చూడ్డంలేదు. ఎదుటి రోడ్డుకేసి స్థిరంగా దృష్టి నిల్పింది. మొహం నిశ్చలంగా వుంది. అది కఠినతా, కోపమా అన్న అనుమానం కుమారస్వామికి కలిగింది. తన ప్రవర్తనే ఆమె ఆవేశానికి కారణమా అన్న ఆలోచన అతన్ని కొద్దిగా కించపరచింది.

హఠాత్తుగా కారాగింది. చూస్తే 'ఇడీస్' బార్ ముందు ఆగింది కారు. రమాదేవి ఏం చెప్పకుండానే కారు దిగి లోపలికి వెళ్ళింది గబగబ. మరో రెండు నిముషాలలోపునే తిరిగి వచ్చింది. ఆమె వెనకే వొక వెయిటర్ ఏవో బాటిల్సు తెచ్చి వెనక సీట్లో పెట్టాడు.

యింటిముందు కారాగగానే డ్రైవరు ముందుకొచ్చి సెల్యూట్‌చేసి తలుపు తెరిచాడు. ఆమె కారుదిగి తాళా లిచ్చింది.

"వెనక సీట్లో వున్నాయి. పైకి పట్టుకురా!" అంటూ, కుమారస్వామి లేనట్టే గబగబ లోపలికి వెళ్ళిపోయింది. అవమానంతో తల కొట్టేసినట్లయింది స్వామికి. కనీసం 'గుడ్‌నైట్' అన్నా చెప్పకుండా, పిలిచి కార్లో ఎక్కించుకుని త్రిప్పిన ఆమె అంత నిర్లక్ష్యంగా తను లేనట్టే వెళ్ళిపోతుందా? ఆ సాయంకాలం అతను జీవితంలో ఎన్నడూ మరిచిపోలేదు.

అనుకున్నది వొకటి. అయినదింకొకటి. తలక్రిందులయింది

వ్యవహారం. యింక తనతో మాట్లాడదు కాబోలు! తొందరపడ్డాడేమో! మిగతావాళ్ళతోకూడా ఆమె యింక మాట్లాడకపోతే ఆ ముగ్గురు తనవంక ద్రోహి అన్నట్టు చూస్తారు! రసికత్వానికిపోతే ఉన్న స్నేహం పోయే ట్టుంది!

మాడిపోయిన ముఖంతో ఇంటికి వెళ్లాడు. ఎవరితో మాట్లాడకుండా గదిలోకివెళ్ళి మంచంమీద వ్రాలాడు.

కాని అతని భయాలన్నీ మరో రెండు గంటలలో దూరమయ్యాయి!

"ఒరేయ్! రమాదేవి భోజనానికి పిలిచిందిరా!" అన్నాడు సారధి గదిలోకివచ్చి. లైట్లార్పేసి మంచంమీద వెల్లికిలా పడుకొని ఆలోచిస్తున్న కుమారస్వామికి నమ్మశక్యం కాలేదు.

"ఎప్పుడు?" అన్నాడు.

"యిప్పుడే పంపింది రెడ్డిని, వంట తయారయిపోతే అక్కడికే తీసుకొస్తే కలిసి తినవచ్చంది!"

అది వాళ్ళకి మామూలు. ఒకరోజు ఆ యింట్లో, మరోరోజు యీ ఇంట్లో! ఒక్కొక్కసారి నోటీసు తక్కువయితే, వంట తయారయిపోతే పిక్నిక్ వెళ్ళినట్లు యిక్కడ చేసినవి అక్కడికి తీసికెళ్ళి అంతా ఏ పేకాటో ఆడి, సరదాగా కలిసి తినడం అలవాటు.

ఎలాగో వెళ్లాడు కుమారస్వామి. ఆమెతో కనులు కలపడానికి భయపడ్డాడు. మాటలు తడబడ్డాయి. కావి, ఆమె ఏం జరగనట్టు నవ్వుతూ మాట్లాడితే, సాయంత్రం జరిగిన సంఘటన దృష్ట్యా ఏం అర్థంకాని అయోమయంలో పడ్డాడ కుమారస్వామి.

మరో పదిహేను రోజులు గడిచాయి.

"తిరుపతి వెడదామనుకుంటున్నాను" అంది రమాదేవి సాయంత్రం లానులో కూర్చుని టీ త్రాగుతుండగా సారధితో. సారధి నోరు తెరచి ఏదో అనేలోగానే నీకు నాతో రావడానికి వీలుంటుందా?" అంది ఆమె. మళ్ళీ

"ఆ....ఆ....వస్తాను, వీలుంటుంది.... వీలుండకేం...." తబ్బిబ్బు

లయ్యాడు జవాబు చెప్పడానికి సారధి. మహా అదృష్టం పట్టబోతున్నట్టు ఏదో సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు.

"వాళ్ళు ముగ్గురూ కూడా వస్తారేమో అడుగు సరదాగా వెళ్ళొద్దాం" అంది కాసేపటికి సారధి ఉత్సాహం పొంగే పాలమీద నీళ్ళు చిలకరించి నట్లు అయింది. వాళ్ళు రాకూడదని, వీలుండకూడదని మనస్సులో ఒక క్షణంలో వెయ్యి దేవుళ్ళని తలుచుకున్నాడు.

ఆ వెయ్యి దేవుళ్ళు సారధి మొర ఆలకించారు తక్కిన ముగ్గురూ రమాదేవి ఆహ్వానాన్ని అందుకోలేనివాళ్ళం అయ్యామని ఏడుపు మొదలు పెట్టారు. స్వామి సరిగ్గా ఆరోజే చీఫ్ ఇంజనీరుతో కలిసి బొంబాయి వెళ్ళ డానికి ముందే ఫిక్స్ అయింది. శర్మకి ఆ ముందురోజే చెల్లెలిపెళ్ళికి వెళ్లాల్సివుంది వెంకట్రావు ఆఫీసుకి ఇనస్పెక్షన్‌కి పై అధికారి ఆ తారీ కునే వస్తున్నారు! సారధి అదృష్టానికి, సారధికి దొరికిన అవకాశానికి అసూయపడుతూనే "బెస్ట్‌ఆఫ్ లక్" అంటూ సారధిని విష్ చేశారు.

"మనం ఇద్దరమేగదా, మద్రాసువరకు ప్లేనులో వెడదాం. మద్రా సులో నా ఫ్రెండు కారిస్తారు. కారులో తిరుపతి వెడదాం. నలుగురూ వస్తే పోనీ సరదాగా కారులోనే వెడదాం అనుకున్నాను" అంది రమాదేవి. ప్రోగ్రాం చేంజి చేసుకోకూడదా అని అడిగే ధైర్యం ఆ ముగ్గురికీ లేక పోయింది.

తిరుపతిలో—ఆరాత్రి కాటేజిలో నిద్రపట్టక దొర్లుతున్నాడు. సారధి మొదటసారి ప్లేనుప్రయాణం, అందులో రమాదేవితో. మద్రాసులో ఆమెఫ్రెండు ఇంట్లో రాచమర్యాదలు, అక్కడనించి కారులో వెనక సీట్లో రమాదేవితో కూర్చుని ఇక్కడికి రావడం, ఉదయం దైవదర్శనం చేసు కోడం, భోంచేయడం, ఇద్దరూ చెరో రూములో పడుకోడం, ఇంతేనా? ఇదేనా తనుకోరింది? ఇంతేనా ఇంతేనా తను ఆశించింది? ఇందుకేనా వచ్చింది?

గడియారంలో ఒకోముల్లు ముందుకు వెడుతూంటే సారధి మన సులో అలజడి ఆరంభమయింది! అశాంతి ఎక్కువయింది. అమూల్య మైన కాలం కరిగిపోతున్నట్టు బాధ పడుతున్నాడు! ఎక్కడ తెల్లవారి

పోతుందో అని గాబరాపడిపోతున్నాడు! కాలాన్ని వెనక్కి త్రిప్పే శక్తి లేకపోయినా, కాలాన్ని సద్వినియోగపరచుకోలేని తన చాతకాని తనాన్ని పిరికితనాన్ని నిందించుకుంటున్నాడు....

తెల్లవారిపోతుంది....మామూలుగా లేస్తారు. కాఫీ త్రాగుతారు, టిఫిను తింటారు. ప్రోగ్రాం ప్రకారం పాపనాశం వెళ్ళొస్తారు. భోంచేస్తారు, ఎండ కాస్త తగ్గాక బయలుదేరి కాళహస్తిమీసి మద్రాసు వెళతారు. ఆరోజు అక్కడ వుండి హైదరాబాదు తిరిగొస్తారు! యిందుకోసమేనా శలవుపెట్టి వచ్చింది! యిందుకోసమేనా యింత ఆరాట పడ్డాడు! దీనికోసమేనా తక్కినవాళ్ళు రాకూడదని ప్రార్థించింది.

సారధి ఆవేశంగా మంచం దిగాడు.... నాలుగు అడుగులు గుమ్మంవైపు వేశాడు. కాళ్ళు వణికాయి, చిరుచెమటలు పట్టాయి, రమాదేవిని తననుంచి విడదీస్తున్న బ్రహ్మరాక్షసిలా ఆ గదులమధ్య తలుపు కనిపించింది! తలుపు దగ్గిర ఊపిరి బిగపట్టి రెండుమూడు నిమిషాలు నిల్చున్నాడు సారధి....అవతలనించి ఏ చప్పుడయినా వినిపిస్తుందేమోనని!....తలుపుమీద చెయ్యి వెయ్యబోతే చెయ్యి వణికింది....ధైర్యం చాల్లేదు. మళ్ళీ వెనక్కివచ్చి మంచంమీద కూర్చున్నాడు.... విసుగ్గా, అశాంతిగా మంచంమీద వ్రాలాడు....

వాచి చూశాడు. రేడియం ముల్లు ఒంటిగంట చూపెడుతూంది.... తెల్లవారడానికి ఇంక నాలుగు గంటలు! నాల్గుగంటలు మాత్రమే వ్యవధి! ఏం చెయ్యాలి.... రమాదేవి ఏం చేస్తూంటుందో ఆమె తనలాగే నిద్రపట్టక బాధపడుతుందేమో!.... లేక హాయిగా పడుకుందో, ఈ వేదనంతా, ఈ ఆరాటం అంతా తనకేనేమో! ఆవిడ ఉద్దేశం ఎలావుందో ఎలా తెలుసుకోవడం? మరోసారి లేచాడు సారధి.... ఓ రెండడుగులు ముందుకు వేశాడు.

గదిలో ఏదో చప్పుడయింది. సారధి చటుక్కున మంచం మీదికి వెళ్ళి పడుకుని చెవులొగ్గి వినసాగాడు. గదిలో బాత్‌రూము స్లిపర్స్ చప్పుడయ్యాయి. లైటు స్విచ్ వేసిన చప్పుడు తలుపు తీస్తున్న చప్పుడు అయింది.

రమాదేవి తలుపు తీస్తూంది.... తీసి వస్తుంది. వచ్చేస్తుంది. గది లోకి వస్తుంది.... సారధి ప్రాణాలుగ్గబట్టుకుని కదలికలేని బొమ్మలా పడుకుని ఓ కన్ను మాత్రం తెరచి వుంచాడు.... రమాదేవికీ నిద్ర పట్టలే దన్నమాట! ఆమే తనలాగే అవస్థపడుతున్నదన్నమాట!... మగవాడు తనే చెయ్యలేని ధైర్యం ఆమె మాత్రం ఎలా చేస్తుంది! తనో చవట దద్దమ్మ! కాబట్టి యింత శ్రమా వృధా చేశాడు, తన సంగతి గుర్తించి లాభంలేదని ఆమె చొరవచేస్తూంది.

సారధి అనుకున్నట్టుగా మధ్యతలుపుకాక వీధి వరండాలోకి వున్న తలుపు తెరుచుకుంది. కుర్చీలాగిన చప్పుడు కిటికిలోంచి గుడ్డివెన్నెలలోకి చూశాడు సారధి. రమాదేవి వరండాలో కుర్చీవేసుకు కూర్చుంది. ఆమెకీ ధైర్యం చాలడంలేదులా వుంది! అవును మగాడు తానే వెనకాడుతూంటే ఆవిడ యింతకంటే ఏం చొరవ చేస్తుంది. యింతకన్న ఏ స్పష్టంగా చెప్పు తుంది! తనకి బుద్ధిలేదు.

నెమ్మదిగా చప్పుడు కాకుండా తలుపులుతీసి రమాదేవి వెనకగా నించున్నాడు సారధి.

పేముకుర్చీలో తల వెనక్కి బాగావాల్చి, తదేకంగా చంద్రుడివైపు చూస్తూ పరధ్యానంగా ఆలోచిస్తూంది రమాదేవి. తెల్లటి జరీచీర, తెల్ల జాకెట్టు ప్రొద్దుట దేవ దర్శనానికి తలారా స్నానంచేసిన జుత్తు ముడివిడి బుజాలనిండ పరుచుకుంది.

వెన్నెల నీడలు కనుపాపల్లో ప్రతిఫలిస్తున్నాయి....ఎంతో మనో హరంగా కనిపించింది రమాదేవి ఆ వెన్నెలలో సారధికి, అతని వళ్ళు వేడెక్కింది. మరో అడుగు ముందుకి వేశాడు. బరువైన అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆ నిశీధి నిశ్శబ్దంలో సుస్పష్టంగా వినిపిస్తున్నాయి. రమాదేవి చకితురాలై తల వెనక్కి త్రిప్పి చూసింది.

"నీవా!"అంది ఆశ్చర్యంగా. "నిద్రపట్టలేదా నీకూ!" అంది మళ్ళీ. సారధి జవాబీయలేకపోయాడు....అలాగే నిలబడ్డాడు వెనగ్గావెళ్ళి రమాదేవి తల గుండెలకి అదుముకోవాలని పించింది ఆ క్షణంలో,

"అదేమిటి అలా నిలబడ్డావు, ఏమిటలా చూస్తున్నావు?" ఆ వెన్నెల కాంతిలోనే సారధి మొఖంలో మార్పు గుర్తిస్తూ అడిగింది రమాదేవి.

"నేను నేను మీరు మీరు" గాభరాపడిపోయాడు సారధి. "ఏమిటలా గాభరాపడుతున్నావు? నిద్ర పట్టడంలేదా నీకూ? రా వచ్చి కూర్చో నాకూ ఎందుకో నిద్ర పట్టడంలేదు ప్చ్! ఎక్కడికెళ్ళినా ఒకలాగే వుంది" ఆమె గొంతు హఠాత్తుగా బరువుగా అయింది. ఆమె బాధ ఏమిటో అర్థం అయినట్టు అనిపించింది సారధికి. ఇద్దరి పరిస్థితీ ఒకలాగే వుంది! మరెందుకీ తాత్సారం.

సారధికి రమాదేవి అన్న ఆ ఒక్కమాట యిచ్చిన ప్రోత్సాహంతో ఎక్కడలేని ధైర్యం వచ్చింది.... మెల్లిగా కుర్చీ వెనకనించి రమాదేవి బుజాలమీద వణుకుతున్న రెండుచేతులు వేశాడు.

రమాదేవి త్రుళ్ళిపడింది. తలత్రిప్పి సారధి మొఖం చూడడానికి ప్రయత్నించింది. సారధి చేయి మరికాస్త గట్టిగా గుచ్చి పట్టుకుంది మరోచెయ్యి ఆమె తలని అతని గుండెలకి చేర్చింది.

"సారధీ." ఆమె గొంతుని ఎవరో నొక్కినట్టు అంతకంటె ఆమె నోట మాట రాలేదు. ఆమెచెయ్యి సారధి చేతిమీద బిగుసుకుంది.

ఎక్కడలేని ధైర్యం వచ్చేసింది. సారధికి ఇంకేం పరవాలేదన్న నిబ్బరం వచ్చేసింది–బుజాలు పట్టుకుని రమాదేవిని నిలబెట్టాడు. మంత్రముగ్ధలా స్పృహలోలేనట్టు సారధి చేతులలో రమాదేవి శరీరం నిల్చింది. రమాదేవిని నడిపిస్తూ గదిలోకి దారితీశాడు సారధి

"సారధీ! సారధీ! నీవు నీవేనా" తన నడుంచుట్టూ చుట్టిన చెయ్యిని విడదీయడానికి ప్రయత్నిస్తూ వణుకుతున్న గొంతుతో నూతిలో పడ్డట్టు అంది రమాదేవి!

వళ్ళు తెలియని ఆవేశంలోవున్న సారధికి రమాదేవి మొహం రక్తంలేనట్టు పాలిపోవడం, ఆమె గొంతు వణకడం, ఆమె చేతులు తన ఇనప కౌగిలినించి తప్పించుకోవడానికి పడే ఆరాటం ఏమీ తెలియలేదు.

గదిలోకి రాగానే రమాదేవిని గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు. "మీరు మీరు అడ్డుచెప్పకండి. నాకు తెలుసు, మీకు ఇది ఇష్టమే" ముద్ద ముద్దగావుంది సారధి గొంతు.

"సారధీ" రమాదేవి గర్జించినట్టే పిలిచింది. చాచిపెట్టి లెంపకాయ కొట్టింది. "ఇడియట్ ఇందుకేనా నిన్ను పిలిచాననుకున్నావు. స్టుపిడ్ గెటౌట్, ఫో వెంటనే" ఆవేశంతో వ్రేలితో గుమ్మంవైపు చూపిస్తూ అర చింది, అతనినించి తప్పించుకుని దూరంగా జరిగి.

సారధి మత్తు దిగిపోయింది. చెంప పట్టుకుని, తెల్లపోతూ, గిల్టీగా చూశాడు. ఆవేశంతో అదురుతున్న రమాదేవి శరీరంవంక చూస్తూండి పోయాడు కర్తవ్య మూఢుడిలా.

"వెళ్ళు వెళ్ళిక్కడనించి, నీ మొహం నాకు చూపించకు" ఆ మాటతో సారధికి పూర్తిగ మెలకువ వచ్చింది. లజ్జతో, అవమానంతో, క్రోధంతో అతని మొహం ఎర్రపడింది. 'మహాపతివ్రతలా నటించకు' పైకనడానికి ధైర్యం చాలని ఆ మాట లోపలే కసిగా అనుకుని విసురుగా గదిలోంచి తనగదిలోకి నడిచాడు. బడాలున తలుపులువేసి ప్రక్కమీద వ్రాలి తలగడలో మొహం దాచుకుంది రమాదేవి.

గదిలోకి వెళ్ళిన సారధి అవమానంతో, కోపంతో దహించుకు పోయాడు.

'హు పాపం ఆవిడ గురించి ఎవరికి ఏం తెలీదను కుంటూంది గాబోలు! మహాపతివ్రత అని అనుకుంటున్నారని అనుకుంటూందిగాబోలు! తను పనికివచ్చాడు కాదులావుంది. ఆవిడకి తను తగడనుకుందేమో' ఆవేశంతో కసిదీరా ఏవేవో అనుకుని రమాదేవిని కించపరచి తృప్తిపడ్డాడు సారధి.

ఓ అరగంట గడిచి ఆవేశం పొంగు తగ్గాక సారధికి తను చేసిన పని తల్చుకుంటూంటే మళ్ళీ రమాదేవి మొహం ఎలా చూడడం అన్న సందేహం వచ్చింది. ప్రొద్దుటే ఆవిడ మొహం ఎలా చూడడం? ఎలా హైదరాబాదువరకు ఆవిడతో ప్రయాణం చెయ్యడం? అసలు మొహం

చూపించవద్దంది. తన ఖర్మానికి తనని వదిలేసి ఆవిడంతట ఆవిడ వెళ్ళిపోతుందేమో! ఇంక తమతో మాట్లాడదేమో తమని చూడదేమో! వాళ్ళు ముగ్గురూ తనమీద ఏడుస్తారు. రమాదేవి స్నేహాన్ని పోగొట్టినందుకు ఛ....తొందరపడి వెధవ పని చేశాను. సిగ్గు, పశ్చాత్తాపం, అవమానం మొదలైనవన్నీ చుట్టుముట్టి సారధికి ఊపిరి ఆడనీయలేదు. ముందు ఎలాగైనా ఆవిడ కంటపడకుండా ఇక్కడనించి పారిపోవాలనిపించింది. తెల్లవారి ఆమె మొఖం చూడలేడు; తరువాత ఊరికి చేరాక ఆమెకి కోపం తగ్గాక అప్పటి సంగతి ఆలోచించవచ్చు. రేపు మాత్రం కంటబడకూడదు. ఆ అర్ధరాత్రి రమాదేవి కంటపడకుండా వెళ్ళిపోదామనిపించినా, అర్ధరాత్రి తనకోసం ఏ బస్సులూ వుండవని ఆగాడు. తెల్లవారిం దగ్గరనించి బస్సులుంటాయి. రమాదేవి లేవకముందే చీకట్నే లేచి వెళ్ళిపోవాలి... నిశ్చయించుకున్నాడు సారధి.

తెల్లవారింది. ఏడుగంటలయింది.

"సారధీ. సారధీ. ఇంకా నిద్రేనా లే....లే....పాపనాశనం వెడదామనుకున్నాంగా ఏడున్నరకి, ఏడయినా ఇంకా నిద్రేనా" త్రుళ్ళిపడి లేచాడు సారధి. ఎదురుగా ఓ చేత్తో కాఫీ కప్పు పట్టుకుని రెండోచెయ్యి తనమీద వేసి లేపుతూ స్వచ్ఛమైన చిరునవ్వుతో తనవైపే చూస్తున్న రమాదేవిని చూసి బిత్తరపోయాడు. తలారా స్నానంచేసింది గాబోలు విరబోసిన కురుల కొసలనించి నీటిబొట్లు రాలుతున్నాయి. తోపురంగు పట్టుచీరె, తెల్లజాకట్టు కుంకంబొట్టు. మొహాన నిర్మలమైన నవ్వు. రమాదేవిని వెర్రివాడిలా చూశాడు సారధి... తను చూస్తున్నది. కలా! విన్నరాత్రి జరిగింది కలా అన్న సందేహం వచ్చింది సారధికి. అప్రయత్నంగా వాచి చూశాడు. ఏడయింది. ఆలోచనల్తో, ఆవేశంతో ఏ మూడున్నరకో నిద్రపట్టిన సారధికి తెల్లవారిలేచి బస్సు కెళ్ళాలన్న గుర్తులేదు.

"ఏమిటలా చూస్తున్నావు? ఇంకా మెలకువ రాలేదేమిటి? ఇదిగో కాఫీ. త్రాగు మెలకువ వస్తుంది...." చిన్న నవ్వుతో కప్పు అందించింది ఆమె. అప్రయత్నంగానే కప్పు అందుకుని లేచాడు సారధి.

"త్వరగా తెములు.... ఆలశ్యం చెయ్యకు, ప్రోగ్రాం అనుకున్న ప్రకారం జరగాలి" అంటూనే గదిలోంచి బైటకి వెళ్ళిపోయింది రమాదేవి.

నిన్న రాత్రి జరిగింది కలకాదు. అని అతని మనసు గట్టిగా చెపుతున్నా ఉదయం రమాదేవి ప్రవర్తన చూస్తూ అది కలని అనుకోకుండా వుండలేకపోతున్నాడు సారధి. అది కల అయితే ఎంత బాగుండును. అనిపించింది. ఆ క్షణాన అతనికి. రమాదేవి నిన్న రాత్రి అసలు ఏం జరగనట్టు అంత నిర్మలంగా, ప్రశాంతంగా ఎలావుంది? అన్నిటికంటె తనని ఎలా క్షమించింది? ఆదరా బాదరా స్నానం అదీ చేస్తున్నా అతని మెదడంతా సందేహాలతో, ప్రశ్నలతో నిండిపోయింది.

పాణినాశనం వెళ్ళే త్రోవలో అంతా కారులో రమాదేవి ఏదేదో మాట్లాడుతూనేవుంది. సారధి ఆ మాటలకి జవాబీయలేక పోవడం అటుంచి ఊ ఆ.... అనికూడా అనలేకపోయాడు. రమాదేవి అంతా నిర్మలంగా, అభిమానంతో మాట్లాడుతూంటే ఆవిడవైపు చూడలేక, ఆమెతో మాట్లాడలేక అతను పడే ఇబ్బంది వర్ణనాతీతం! ఆ బాధ ఆవిడ్ని క్షమార్పణ కోరుకుంటేనేగాని పోయేట్లు లేదనిపించింది. చేసిన పాపం చెపితే పోతుంది, పొరపాటు చేశానని, తప్పయింది క్షమించమని అడగాలి.

"ఏమిటలా వున్నావు ప్రొద్దుటనించి మాట్లాడవేం" చాలా సేపు చూసి అంది రమాదేవి.

"మీరు మీరు నన్ను క్షమించాలి, క్షమించాననండి" ఎలాగో నోరు పెగుల్చుకుని ఆమెవైపు చూడలేక తల దించుకుని రెండు మాటలు అన్నాడు సారధి.

రమాదేవి మొహం ఒక్క క్షణం నల్లబడింది. అంతలోనే చిరునవ్వు తొంగిచూసింది ఆమె పెదాలపైన. "క్షమాపణదేనికోసం?" అంది.

సారధి చివ్వున తల ఎత్తాడు. ఏం ఎరగనట్లు, జరగనట్లు విస్మితంగా చూస్తున్న ఆమె మొహం చూసి జవాబు చెప్పటానికి తడబడ్డాడు, ఎలా చెప్పాలో అర్థం గాలేదు.

"నావల్ల తప్పయింది  తొందరపడ్డాను మీరు క్షమించాననండి." వణుకుతున్న పెదాలతో అన్నాడు.

"నీవేం అంటున్నావో అర్థంగావడంలేదు"

"నిన్న రాత్రి నిన్న రాత్రి నే తొందరపడ్డాను."

"కలగన్నావా రాత్రి ?" నవ్వింది రమాదేవి. సారధి చకితుడై చూశాడు. నిజంగానే అది కలా ఏమిటన్న సందేహం వచ్చింది.

"చూడు సారధీ అప్పుడప్పుడు పీడకలలు వస్తుంటాయి వాటిని గురించి పట్టించుకుని మనసు పాడుచేసుకోకూడదు ! మరిచిపోవాలి వెంటనే అలాంటివాటిని." మృదువుగా సారధి చెయ్యినొక్కి నెమ్మదిగా అంది రమాదేవి.

సారధి కళ్ళు కృతజ్ఞతతో ఆనందంతో చెమ్మగిల్లాయి.

* * *

తరువాత నెలరోజులు గడిచాయి. ఆ రోజు ఆదివారం ! ఉదయం ఏడు గంటలయింది.

మిత్ర బృందం తలుపులు బిగించుకుని నిద్రలో వున్నారు ! ఆదివారం ! లేచి చేసే పనేంలేదు అని ఎనిమిది గంటలదాకా నిద్రపోవడం అలవాటు. శనివారం రాత్రి రెండో ఆటకో, పేకాట వేసుకుని ఏ ఒంటి గంటకో పడుకుంటారు. కనక లేవడానికి ఆలశ్యం అవడం తప్పదు ! అంతేకాక ఆదివారం స్పెషల్‌గా పూరీలో, దోసెలో చేస్తాడు మణి. అవి తయారు చేయడం ఎలాగో ఆలశ్యం అవుతుంది. కనుక, ఆలశ్యంగా లేచి వేడి వేడి టిఫిన్ తినడం ఆదివారం ప్రత్యేకత.

కాని ఏడు గంటలకే ఆ రోజు మణి తలుపులు తట్టి లేపేశాడు.

గాబరగా విసుక్కుంటూ లేచిన వాళ్ళకి మణి, అతనితోపాటు గాభరాగా వున్న రమాదేవి బంట్రోతు రెడ్డి కనిపించాడు.

"బాబుగారూ, మీ రొకసారి రావాలి. అమ్మగారు ఏమిటో పిలిస్తే పలకటంలేదు. ఇంత ఆలశ్యంగా ఎప్పుడూ లేవలేదు...." రెడ్డి ఆందోళనగా అన్నాడు.

"నిద్ర పట్టిందేమో, పడుకుని వుంటారు దానికింత గాభరా ఎందుకు !" నిద్రమత్తు వదలని, శర్మ బద్ధకంగా అన్నాడు ఆవలిస్తూ.

"రాత్రి ఎన్నింటికి పడుకున్నారు. ఆలశ్యంగా పడుకున్నారా?...." వెంకట్రావు గదిలోంచి అప్పుడే లేచి వస్తూ విషయం విని అడిగాడు.

"రాత్రి సినిమాకివెళ్ళి ఒంటి గంట కొచ్చారు గదండీ, తరువాత ఎంత సేపటికి పడుకున్నారో తెలియదండి....అమ్మగారు ఎంతఆలశ్యంగా పడుకున్నా తెల్లారగానే లేచిపోతారండి, రోజూ .... మీరొకసారివచ్చి పిలవండి బాబూ...." గాభరాగా ఆందోళనగా అన్నాడు. చొక్కాలు తొడుక్కుంటూ. ఒక్కొక్కరు రమాదేవి ఇంట్లోకి నడిచాడు త్వరగా.

రమాదేవి గది తలుపులు తడ్తూ నలుగురూ పిలిచారు జవాబులేదు. గదిలోంచి ఏ శబ్దమూలేదు. అందరూ మొహాలు చూసుకున్నారు. "తలుపులు బద్దలుకొడదాం" స్వామి అన్నాడు ఆఖరికి.

తలుపులు బద్దలుకొట్టి తెరిచారు. ప్రక్కమీద నిశ్చలంగా నిద్రపోతున్నట్టు, నిర్జీవంగా పడివుంది రమాదేవి శరీరం. అదిరిపోయారు అందరూ.

తరువాత జరగవలసిన తతంగం అంతా జరిగింది. డాక్టరుని పరుగుమీద తీసుకొచ్చారు. నిద్రమాత్రలు తిని చచ్చిపోయిందని తేల్చడంకంటె ఏం చెయ్యలేకపోయాడు డాక్టరు. ఆ మాట డాక్టరు చెప్పకముందే మంచం ప్రక్కన టేబుల్‌మీద ఖాళీ మాత్రల సీసా చెప్పింది. సీసా క్రింద పెట్టిన కాగితం కవర్లు తీశారు మిత్రులు ఆరాటంగా. వాళ్ళ నోట మాట రావడంలేదు. మెదడు మొద్దుబారిపోయినట్లయింది. కబురు తెలిసి రమాదేవి మిత్రబృందం, పరిచయస్తులు, స్నేహితులతో ఇల్లు నిండిపోసాగింది. కొందరు అయ్యో, అయ్యోఅన్నారు. కొందరురానికన్నీరు తుడుచుకున్నారు కొందరు కారణమేమిటన్న మీమాంసని చర్చిస్తూ మధ్య మధ్య నిట్టూర్పులు విడుస్తున్నారు. మరి కొందరు ముందు జరగాల్సింది; ఏమిటన్న సందేహం వెలిబుచ్చారు....ఎవరికి వారు ఆ బరువు.... తమమీద ఎక్కడపడుతుందోనని బెదురుతున్నారు. రమాదేవితో బాగా పరిచయ మున్నవారు

ఆమె తాలూకు దూర బంధువులు ఎక్కడెక్కడ వున్నారో జ్ఞప్తికి తెచ్చుకొని టెలిగ్రాంలు యియ్యడానికి మనిషిని పంపుతున్నారు. మరికొందరు పోలీసులకి చెప్పడమా మానడమా అన్న సందేహాన్ని వెలిబుచ్చారు. చెప్పడమే మంచిదని నిర్ణయించి పోలీసులకి కబురు చెప్పారు. పోలీసులు వచ్చారు, వివరాలు రాసుకున్నారు. ఉత్తరాలు పరీక్షించారు. ఒకటి పోలీసు కమీషనర్‌గారికి — తను ఆత్మహత్య చేసుకునే కారణాలు కేవలం తన వ్యక్తిగత సమస్య అని. ఎవరికీ ఈ విషయంలో ఏ సంబంధం లేదని రాసిన ఉత్తరం. రెండోది ఆమె లాయరు రంగనాధంగారికి రాసింది, తన యావదాస్తి దాన ధర్మాలక్రింద వినియోగించాలని తన కోరిక అంది. పతిత స్త్రీల ఉద్ధరణ క్రింద తన నివాస భవనంతోపాటు పదిహేనువేల రూపాయలు విరాళంగా యివ్వాలని సూచించింది. పట్టణంలోని మరో ఇల్లు "అనాధ బాలల నివాసంగా, తన చనిపోయినకొడుకు పేరుమీదుగా విరాళం ఇస్తున్నట్టు వ్రాసింది. మిగిలిన రొక్కంలో తనక్రింద పనిచేసిన వారికి తలో ఐదేసివేలరూపాయలు, ఆర్థికంగా వెనుకబడిన తన పినతల్లి కొడుకికి పదివేలరూపాయలు, మేనత్త కొడుకుకి పదివేల రూపాయలు యియ్యాలని సూచించింది. తన నగలు విలువైన వస్తుసామాగ్రి అన్నీ అమ్మి స్త్రీల కళాశాల బీద విద్యార్థినులకి స్కాలర్ షిప్‌గా వినియోగించాలని కోరింది. ఆమె ఇల్లు ఆమె కోరికప్రకారం నెరవేర్చే భారం లాయరుగారిమీద పెట్టింది. ఆమె విల్లు చదివిన అందరూ ఆమె ఉదార బుద్ధిని, త్యాగనిరతిని కొనియాడారు. మూడో ఉత్తరం.... సారధి, శర్మ, స్వామి, వెంకట్రావు.... నలుగురు పేర్లు కవరుమీద వున్నాయి. కవరు సీలుచేసివుంది. బరువుగా పెద్దదిగా వుంది. కవరు అందుకుంటూంటే వాళ్ళ మనసులో అప్పుడు చెలరేగిన భావాలు చెప్పడం కష్టం. మౌనంగా కవరు జేబులో పెట్టుకున్నాడు శర్మ.

తరువాత పోలీసులు తతంగం పూర్తి చేశారు. బంధువులు ఎప్పుడు వచ్చేది లేనిది ఏది తెలియని విషయం గనక శవాన్ని వుంచడం మంచిది కాదు అని దహనక్రియలు వెంటనే జరపడం మంచిదని అందరూ నిర్ణ

యించారు. ఏర్పాటులు అందరూ కలసి చెకచెక చేసేశారు. రమాదేవి శరీ రాన్ని ఆమె అంతస్తుకి తగిన ఆర్భాటంతో అగ్నికి ఆహుతి చేశారు.

అందరితోపాటు యాంత్రికంగా రమాదేవి శరీరంతో శ్మశానందాకా వెళ్ళి వచ్చారు మిత్రబృందం. వాళ్ళ నోట మాటలేదు. వాళ్ళ మెదడు మొద్దుబారినట్లు అచైతన్యంగా, యాంత్రికంగా జరుగుతున్న తతంగంలో పాల్గొన్నారు.

అంతా ముగిసి ఇంటికివచ్చే వాళ్ళ మనసులో అనేక ప్రశ్నలు మొదలయ్యాయి। రమాదేవి ఆత్మహత్య ఎందుకు చేసికొంది? కారణ మేమిటి? ఆవిడ కేం లోటని యింత దారుణానికి పాల్పడింది.

అవే ప్రశ్నలు ఇల్లు చేరగానే నల్గురినోట పైకి వచ్చాయి. "అన్నట్టు ఆ ఉత్తరం ఏదిరా? దాన్లో ఏమన్నా రాసిందేమో కారణాలు।" సారధి ఉత్తరంసంగతి గుర్తొచ్చి హఠాత్తుగా అడిగాడు। ఉత్తరం మాటే మరచిన శర్మ జేబు తడిమి ఉత్తరం పైకితీసి చింపాడు.

"చదువు"। అన్నారు ముగ్గురూ ఏకకంఠంతో.

"తమ్ముళ్ళూ।" నలుగురూ ఒక్కసారి గిల్టీగా ఒకరి మొహాలలోకి ఒకరు చూసుకొని కళ్లు వాల్చుకున్నారు.

"నా అన్నవాళ్ళు లేని నాకు మీ నలుగురిని చూసిన మొదటిరోజే ఇలాంటి తమ్ముళ్లు నాకూ వుంటే ఎంత బాగుండేది అనిపించింది। వుంటే, యీ అక్కకీ, జీవితంతో వంటరిగా పోరాడలేక అలసిపోయే అక్కకి ఎంత ఊరటగా వుండేది అన్పించింది। తమ్ముళ్లు, చెల్లెళ్ళు ఎవరూలేని నాకు సోదరప్రేమ ఎలాంటిదో తెలియకపోయినా మీతో పరిచయం వృద్ధవుతున్నకొద్దీ ఆ అనుభూతి తెలియసాగింది. రక్తం పంచుకుని పుట్టక పోతేనేం అనిపించిన క్షణాలు వున్నాయి నాకు.

కానీ, అంత అదృష్టం నాకు పట్టనీయలేదు మీరు। మిగతాలోకంతో పాటు మీరూ కలిసిపోయారు.... మీకంటె పెద్దదాన్నే। మీ కంటికి అమ్మగా కన్పించకపోయినా 'అక్క'గనైనా కనిపించకపోవటం నా దురదృష్టం

కాక మరేమిటి? కన్నతల్లిని, రక్తం పంచుకుపుట్టిన సోదరినితప్ప మరో ఆడదాన్ని ఓ పురుషుడు 'ఆడదాని'గా తప్ప మరో పవిత్రభావంతో చూడ లేడన్న సత్యం మరోసారి తెలుసుకున్నాక నేనెంత కృంగిపోయానో ఎలా చెప్పగలను?

మీ నలుగురూ....నలుగురిలో ఏ ఒక్కరైనా నాలో పేరుకుంటున్న నిరాశని, నిరుత్సాహాన్ని తొలగించి....నా భావం తప్పని నిజాయితీగా నిరూపించుతారని ఆశించడం వృథా అయిపోయింది....నిన్న రాత్రి సిని మాలో వెంకట్రావు, అంతకు వారం క్రితం నా గదిలో శర్మ, తిరుపతిలో సారథి, నెలక్రితం స్వామి మీ అందరూ మీ నైజగుణమే చూపించు కున్నారు. నే ఆడదానిగా మాత్రమే, కనిపించాను మీ కంటికి!"

శర్మ చదవడం ఆపి వెంకట్రావువంక చూశాడు. మిగతా ఇద్దరూ కూడా ప్రశ్నార్థకంగా వెంకట్రావువంక చూశారు. వెంకట్రావు తల వంచు కున్నాడు.

"నిన్నరాత్రి ఆవిడతో సినిమాకు వెళ్లావా........ఏం జరిగింది అక్కడ?" శర్మ నిలేసినట్లు అడిగాడు. వెంకట్రావు మొహం ఎర్రబడింది.

"ఏం అన్నావు? ఏం చేశావు?" ఏక కంఠంతో అడిగారు తక్కిన ముగ్గురూ, వెంకట్రావుకి తక్కిన వారిముందు దోషిలా నిలబడాల్సిరావడం పౌరుషం తెప్పించింది.

"ఏం చేశాను? మీరేం చేశారు?" ఎదురుతిరిగి ప్రశ్నించాడు. మిగతా ముగ్గురూ తల దించుకున్నారు.

"ఊఁ తర్వాత చదువు!" కాసేపటికి అన్నాడు స్వామి.

—ఎవరికి చెందని ఏ చెట్టునో కాసిన పువ్వంటే ప్రతివాళ్ళకీ ఏదో హక్కు వున్నట్లు! ఎవరికి వారే ఆ పువ్వు తమ స్వంతం అన్నట్టు దాన్ని అందుకునే స్వాతంత్ర్యం తమకున్నట్టు, ఆ పువ్వుని పొందడంలో తప్పేమీ లేదని భావించడం మానవ సహజం! కాని ఓ సారి కోసి వాసన చూసిన పూవు పూజకు పనికిరాదు! మహాఅయితే అలంకారానికి మాత్రమే పని కొస్తుందని అనుకుంటారు!

అలాంటి పువ్వునే నేను. అందులో నా జీవితాన్ని తిరగరాని వంపులు త్రిప్పి నన్ను చూసిన ప్రతివాళ్ళకీ ఒకేభావం కలిగేలా చేసుకున్నాను. అంచేత మిమ్మల్ని యీ విషయంలో తప్పు పట్టలేను. తప్పేమన్నావుంటే నాది।

ఐశ్వర్యం, అందం, చదువు సంస్కారం అన్నీ వుండి ఎందుకిలా నా జీవితం అష్టవంకరలు తిరిగింది అని ప్రశ్నించుకుంటే ఎవరిని ఏమనాలో తెలియని అయోమయస్థితిలో పడి ఆఖరికి నా దౌర్భాగ్యాన్ని, దురదృష్టాన్ని నిందించుకోడంతో ఆ ప్రశ్నకి జవాబు ఆఖరవుతుంది.

తల్లిలేని ఏకైక గారాలబిడ్డగా, అపురూపంగా ఆడింబాటగా పెరిగాను। తనకున్న డబ్బుతో—అందం, చదువు, సంస్కారం, సాంప్రదాయం మాత్రం వుండి డబ్బులేని అల్లుణ్ణి దేశం అంతా తిరిగి సంపాయించి ఇల్లరికం తెచ్చుకున్నారు నాన్న। ఆ ఉప్పుతిని ఆ యింటికే నిప్పంటించే కృతఘ్నుడవుతాడని ఆయన ముందు కలగనలేదు. విజ్ఞానశాస్త్రంలో మరింత విజ్ఞానం ఆర్జించడానికి విదేశాలువెళ్ళి, ఆ వున్న శాస్త్ర జ్ఞానం పోగొట్టుకుని కట్టుకున్న భార్యని, కళ్లార చూడని కొడుకుని వదిలి మరో స్త్రీని పెళ్ళాడిన దౌర్భాగ్యుని కృతఘ్నతని ఆనాడు నేను ఎలా సహించగలిగానో। నా ఐశ్వర్యాన్ని, నా అందచందాలని తృణపాయంగా తృణీకరించగల్గిన మనిషి విబ్బరాన్ని మెచ్చుకోవాలో, ఆ నిబ్బరాన్ని అందించిన మరో స్త్రీ అదృష్టానికి అసూయపడ్డాను నా దౌర్భాగ్యానికి చింతించాను, తెలియని స్థితి అది। నాన్నకున్న పలుకుబడి, డబ్బు, ఆయన తిట్లు, బెదిరింపులు, శాపనార్థాలు ఏవీ అల్లుణ్ణి త్రిప్పి తీసుకురాలేకపోయాయి। ఆ ఖర్చుపెట్టిన డబ్బంతా కక్కమన్న నాన్న ఆవేశానికి జవాబుగా కొన్నాళ్ళకి డబ్బుతోపాటు ఉచిత సలహాకూడా ఇచ్చాడా ప్రబుద్ధుడు. మీ కూతురికి మరో పెళ్ళి చేయండి అని. రెండేళ్ళు విదేశాలలోవుండి భారతదేశ సంస్కృతి మరచిపోయిన ఆ మహానుభావుడికి ఈ దేశంలో వివాహితురాలిని, బిడ్డతల్లిని పెళ్ళాడుతానని ముందుకువచ్చే మగ మహారాజులుండరన్న సంగతి గుర్తురాకపోవడంలో

వింతలేదు. ఏణ్ణర్థం వైవాహిక జీవితానికి గుర్తుగా ఏణ్ణర్థం బిడ్డ మాత్రం మిగిలాడు!

కూతురి బ్రతుకులో నిప్పులు తను పోయకపోయినా తనే చేతులారా పోసినట్టు గుండెలు బాదుకుంటూ ఏడ్చిన ఆయన గుండె ఆ దెబ్బలు ఏన్నాళ్లో తినలేక ఆ గుండె కాస్తా ఆగి వూరుకుంది— ఓనాడు!

డబ్బుకి దగ్గిరచేరే తోడేళ్ళగుంపు తప్ప నిజమైన అభిమానం, ఆదరణచూపే నా అన్నవాళ్ళు లేని నాకు ఆ బిడ్డే సర్వస్వంగా మిగిలాడు. నా ఆశలు కలలు కోరికలు అన్నీ చిన్న ప్రాణంమీదే నిల్పి, మిగతా ప్రపంచాన్ని, మిగతా సుఖాలని నిర్లక్ష్యం చేశాను! కాని దేవుడు తను సృష్టించిన వాటిని నిర్లక్షించే శక్తి నాలాంటి మానవమాత్రురాలికి మానవాతీత శక్తులుండకూడదని గాబోలు నా ఏకైక ఆశని మొగ్గలోనే త్రుంచేశాడు. నా యావత్తు ఆస్తి ధారపోస్తానన్నా ఏ డాక్టరూ నా బిడ్డని బ్రతికించలేకపోయారు.

తరువాత-తరువాత-ఏముంది! ఎందుకు బ్రతకాలో, ఎవరి కోసం బ్రతకాలో తెలియక బ్రతుకుతూ దేవుడిమీద, మనుష్యులమీద కసి పెంచుకుంటూ, నా ఈస్థితికి కారణమైన వ్యక్తిని ఏమిచెయ్యలేక ఆ వ్యక్తి వారసు లయిన పురుషజాతినే ఏహ్యించుకోవడం మొదలుపెట్టాను. మగాడన్న వాడిని నల్లిని నలిపినట్టు నేలరాసి పారేయాలనిపించేది; నా అందం, డబ్బు పణంగాపెట్టి శలభాల్లా చుట్టుతిరిగే మగవాళ్ళని మత్తెక్కించి కవ్వించి కసిదీరా కాటేయాలన్నంత విషం నిలువెల్లా పెంచుకున్నాను. ఆడదంటే ఏమిటో, ఆడది తలిస్తే ఏం చెయ్యలేదో చేసి చూపించాలనీ క్రూరంగా ఆలోచించాను; ఎవరిని లెక్కచెయ్యకుండా, నా యిష్టం వచ్చిన రీతిని విచ్చలవిడిగా తిరిగినా ఎవరూ నోరెత్తకుండా చెయ్యగలిగే ఆయుధం డబ్బు నాకుంది! నాకేం లోటు! అని వికట అట్టహాసం చేసేదాన్ని.

మంచి, చెడు, నీతి, నియమం అన్న పదాలకి అర్థాలుమరిచి నా కామందాన్ని ఇచ్చేరీతిని జీవితాన్ని నా యిష్టంవచ్చిన రీతిలో మలుచుకుందామనుకున్నాను.

కానీ తరతరాలుగా రక్తంలో జీర్ణించుకుపోయిన సంస్కృతి, సాంప్రదాయాలు, పిరికిమందు పోసి, పాపభీతి మనసులో పెట్టి వెనక్కి లాగుతూంటే పగ, పంతం, ముందుకు లాగుతుంటే రెండింటికి మధ్య నలిగిపోతూ నన్ను నేను మరిచిపోవడానికి తాగుడు, తందనాలు అలవాటు చేసుకున్నాను. ఏదిచేసినా పై పై పూరట, తాత్కాలిక ఉపశమనంతప్ప నిజమైన మనశ్శాంతి వీటివల్ల లభ్యంకాదని కొన్నాళ్ళకి అర్థం అయింది. పూజ, పునస్కారాలు, త్రాగుడు దేనిలోనూ లభ్యంకాని మనశ్శాంతి మరెక్కడ దొరుకుతుందో అర్థంకాక చిత్రహింసకి గురి అయ్యేదాన్ని మళ్ళీ పెళ్ళి చేసుకుంటె!? పురుష జాతినే ఏహ్యించుకునే నాకు ఆ మాట తల్చుకోవడానికే అసహ్యంవేసేది. ఎలాగో సరిపెట్టుకుంటె బ్రతుకులో నవ్యత లభిస్తుందని ఆశించినా, నన్ను ఎవరన్నా పెళ్లాడుతానని ముందుకువస్తే అది కేవలం డబ్బుకోసం మాత్రంఅని తెలుసు! మొఖంఎదుట అభిమానం, గౌరవం చూపిస్తూ మొఖం చాటుకాగానే నా గురించి వచ్చే వ్యాఖ్యానాలు ఎలాటివో నాకు తెల్సు! నామీద మనుష్యులకున్న అభిప్రాయాలు తెలిసి నన్ను మనసారా ప్రేమించలేని మనిషితో ఏం సుఖపడగలను?

పరిచయస్తులు, మిత్రులు! 'మళ్ళీ పెళ్లాడ కూడదా', అని సలహా లిచ్చేవారు! ఆ సలహా ఇచ్చేవారిలో ఎవరూ పెళ్ళాడడానికి ముందుకురారని నాకు తెలుసు! ఎవరిదాకానో ఎందుకు. మొన్న మొన్న శర్మ నాకోసం ఆరాటంగా అశ్రులు చాస్తుంటే "పెళ్లాడుదాం" అన్నాను. అంతే కలవర పడిపోయి ఆ క్షణంలోనే నేనెక్కడ బలవంతంగా తనని పెళ్లాడేస్తానేమో నన్నంత గాభరాగా వెళ్ళిపోయాడు. ఆడదాన్ని అనుభవించడానికి అడ్డురాని వయసు, పరువు, ప్రతిష్ఠ. పెళ్ళికి అడ్డువస్తాయని క్రూరంగా నవ్వుకున్నాను.

చదువుతున్న శర్మ మొఖం ఎర్రబడిపోయింది. మొఖం గంటు పెట్టుకున్నాడు. తక్కిన ముగ్గురి చూపుకి జవాబుగా "ఆవిడని పెళ్ళాడ కూడదా అని అడిగితే నేను చేసుకుంటా ననేమిటి అర్థం?" సంజాయిషీ ఇస్తున్నట్లు గొణిగాడు.

అదీ లాభంలేదని తేలాక ఏ పిల్లవాడినైనా తెచ్చుకొని పెంచుకుంటే అన్న ఆలోచన వచ్చింది. కావి మాతృత్వంలో మమత, కన్నబిడ్డ

మీద మమకారం, కన్నకడుపు తీపి అన్నీ అనుభవించాక, ఎక్కడనించో తెచ్చిన బిడ్డకి తల్లిగా న్యాయం చేకూర్చలేననిపించి ఆ ఉద్దేశమూ విరమించుకున్నాను.

ఇంకేం మిగిలింది! తిండి, తిరగడం, త్రాగడం, క్లబ్బులలో డాన్సులు, పార్టీలు ఇదే నా జీవితం! మొగాడ్ని ఆకర్షించే అందంవుండి, విచ్చలవిడిగా తిరిగే వంటరి ఆడదాని పవిత్రతని ఎవరూ నమ్మరు! నమ్మక పోతే నాకువచ్చిన నష్టం ఏముంది! నేను మొండిద్నాన్ని! ప్రపంచాన్నే, మనుష్యులనే, ధిక్కరించి బ్రతుకుతున్న దానికి దేని గురించి భయం!

రోజులు గడుస్తున్నకొద్ది యీ జీవితమూ పాతబడి విసుగు పుట్టించ సాగింది!

ఎవరికీ కనపడని లోతయిన గాయం కాలం మందు వేసినట్లు పూడ్చ సాగింది! ప్రతీకార వాంఛతో భగభగ మండే మనసుమీద కాలం నీళ్ళు చిలకరించి చల్లార్చింది!

ఆ సమయంలో తారసపడ్డ మీ నలుగురిని చూసిన వేళా విశేషం ఏమిటోగాని, మమత, మానవత్వం, అనురాగం, ఆప్యాయత అన్న పదాలకి తిరిగి అర్థాలు స్ఫురించడం మొదలుపెట్టాయి! ఎక్కడా లభ్యంకాని ఆత్మీయత ఆదరణ మీనించి లభ్యం అవుతాయని ఆశించాను! కాని అది అత్యాశ అయింది! మీరూ పురుషులేనన్న మాట నేను ఎందుకు మరచి పోవాలి?! నా నమ్మకాన్ని, నా ఆశని నా కోరికని కూలద్రోశారు మీరు! తక్కిన లోకంతోపాటే కలిసిపోయారు మీరూ! నేనిచ్చిన చనువుని నేచూపిన ఆప్యాయతని, అనురాగాన్ని అపార్థం చేసికొన్నారు మీరు! ఎన్నో ఢక్కామొక్కీలు తిని బండబారిన హృదయం ఎందుకో యింత చిన్న సంఘటనలకే చలించిపోయింది....నా నమ్మకం యీ సారీ దెబ్బ తినడం మానుతున్న గాయాన్ని రేపినట్లయింది. నాలో ఆరిపోతున్న జ్వాల తిరిగి ప్రజ్వరిల్లింది....! ఎంత సరిపెట్టుకుని ప్రతిసారీలాగా రాజీ పడదామన్నా సరిపెట్టుకోలేకపోయాను! ఎన్నోసార్లు ఎన్ని విషయాలలో ఓటమి ఎదురయినా నాకు యీ సారి యీ ఓటమి సహించరానిదయింది! బ్రతికి జీవితంతో పోరాడి గెలవడానికి శక్తిసామర్థ్యాలు కరవయి, బలహీనతలు

చుట్టుముట్టి....అడుగడుగునా ఓటమి ఎదుర్కొంటూ ఎన్నిరోజులు యీ బ్రతుకు నెట్టడం?

ఆడదంటే మీరే భావమూ పురుషులకి కల్గకపోవడం ఓ శాప మేమో. అందుబాటులోవున్న ఆడదంటే ఆశించని వాడెవడు? పువ్వులాంటి ఆడది ముల్లులాంటి పురుషుల చేతిలో నలిగిపోయి, హింసలకి గురిఅవడం తరతరాలుగా జరుగుతున్నదే! కానీ, చిత్రమేమిటంటే—ఏ ముళ్ళయితే హింసిస్తాయో, ఆ ముళ్ళకంచే పువ్వుకి శ్రీరామ రక్ష అయి కాపాడడం చిత్రంగాదూ! ఆ ముళ్ళకంచె అనే మగవాడే ఆడదానికే అండఅయి కాపాడడం సృష్టి చిత్రమే గాబోలు! ఆ ముళ్ళకంచె అడ్డుగా లేకపోతే ఆ పూవుని సజీవంగా ఒకరోజయినా వుంచుతారా? రోడ్డునపోయే ప్రతివాడికి అందమైన ఆ పువ్వుమీదే దృష్టి! ఆఖరికి నోరెరగని పశువులుకూడా ఆ నవనవలాడే పువ్వుని మొక్కతోసహా పీకేస్తాయి, నా జీవితం అంతే!

ప్రతిక్షణం ఆపదల బారినుంచి తప్పించుకోడానికి నాకే ముళ్ళకంచె అండలేదు. అందుకే అనుక్షణం ఎదురయ్యే ఆపదలనుంచి నన్ను నేను రక్షించుకోడానికి, పోరాడడానికి నాకింక ఓపికలేదు! ఎప్పటికైనా సుకుమారమైన పువ్వు కంటకంముందు తల ఒగ్గవల్సిందే! గెలుపు ముల్లుదే! ఓటమి పువ్వుదే! అంచేతే ఓడిపోయి వెళ్ళిపోతున్నాను....శెలవు! నేను లేని తర్వాతనయినా నన్ను సోదరిగా గుర్తించి, బ్రతుకులో ఓడిపోయి పారిపోయిన అక్కకి ఒక్క కన్నీటిబొట్టు అయినా తనకోసం కార్చేవారున్నారంటే ఆమె ఆత్మకి శాంతి.

మీ నల్గురూ సుఖసౌఖ్యాలతో భావిజీవితం గడపాలని నా ఆఖరి కోరిక! ప్రార్థన! మళ్ళీ జన్మలోనయినా ఇంత వంటరి జీవితం ప్రసాదించవద్దని ఆ భగవంతుడిని వేడుకుంటాను—శెలవు—! రమాదేవి—

శర్మ చేతుల్లో మొహం దాచుకున్నాడు కళ్ళు నిండుకోగా!

"మనమే చంపేశాం, మనమే ఆవిడని నిలువునా హత్య చేశాం.... బలవంతంగా ఆమె ప్రాణాలు తీసేశేం" ఆవేదనగా కళ్ళు తుడుచుకున్నారు నల్గురూ.

—౦—